క్లుప్తంగా

1 నుంచి స్థూలకాయ నివారణ శిబిరం

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వ విద్యాలయం యోగా కేంద్రం ఆధ్వర్యంలో మార్చి 1వ తేదీ నుంచి మధుమేహం, వెన్నునొప్పి, స్థూలకాయ నివారణ శిబిరం నిర్వహిస్తున్నట్లు కేంద్రం సంచాలకులు ఆచార్య ఓ.ఎస్.ఆర్.యు. భానుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు నేరుగా బీచ్‌రోడ్డులోని యోగా విలేజ్‌లోని 99854 56150, 94944 01919, 93980 19922 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు తరగతులు నిర్వహిస్తారు.

నేడు గౌరీ జ్ఞానలింగేశ్వర దేవాలయ వార్షికోత్సవం

మద్దిలపాలెం: కొత్త వెంకోజీపాలెంలో గల శ్రీ జ్ఞాన లింగేశ్వరస్వామి దేవాలయ 33వ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించనున్నామని గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు పీలా రమణ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు గౌరీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 12 నుంచి అన్నదానం ఏర్పాటు చేశామన్నారు. సాయంత్రం 6 గంటలకు తిరువీధి ఉత్సవం నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 6.30 గంటలకు పంచామృతాభిషేకం, వస్త్రాలంకరణతో స్వామివారి దర్శనం కల్పించనున్నామన్నారు.

సమత కళాశాలలో మేనేజ్‌మెంట్ మీట్

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని సమత కళాశాలలో గురువారం దిశ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ మీట్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో నగరానికి చెందిన 60 వరకు మేనేజ్‌మెంట్ కళాశాలల విద్యార్థులు పాల్గొననున్నట్లు కళాశాల డైరెక్టర్ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మీట్‌లో కామర్స్ ఎక్స్‌పో, హెచ్‌ఆర్ కనెక్ట్ వంటి ఈవెంట్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. దీంతో పాటు మార్చి 1వ తేదీన ఎంవీపీ కాలనీలోని ఆళ్వార్‌దాస్ మైదానంలో కళాశాల వార్షికోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డులో బుధవారం తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త, విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. విశాలాక్షినగర్, దయాల్‌నగర్, కొండవాలు ప్రాంతాల్లోని కాలువలు, రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా పనులు రూ 1.35 కోట్ల జీవీఎంసీ నిధులతో జరుపుతున్నట్లు తెలిపారు. ఈ పనులు తొందరగా జరిపించాలని జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ స్వాతి, జీవీఎంసీ వర్క్స్ ఏఈ రమణ, ఉమ్మడి అప్పారావు, కళ, శంకర్ పాల్గొన్నారు.

కృష్ణా కళాశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సంధ్యా ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహించిన శిబిరంలో అధ్యాపకులు, విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో కంటి ఆస్పత్రి వైద్యులు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్వతీశ్వరుల కల్యాణోత్సవాలు ప్రారంభం

సీతంపేట: సీతంపేటలో కొలువైన పార్వతీశ్వర స్వామి 34వ వార్షిక కల్యాణ మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ఈవో రమాభాయి పర్యవేక్షణలో శైవగమ పండితుడు అయిలూరి శ్రీనివాస దీక్షితులు, ఆలయ అర్చకులు గంగవరపు శివాజీ శర్మ, భాస్కరశర్మ నేతృత్వంలో పార్వతీశ్వరుల మంగళస్నానాలతో వేడుక మొదలైంది. వేద మంత్రాలు, మేళతాళాల మధ్య పార్వతీశ్వరుల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా మంగస్నానం జరిపించారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 9.30 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసన, అంకురార్పన నిర్వహిస్తామని తెలిపారు.

సకల ప్రాణికోటికి సైన్సే ఆధారం

- కళాశాలలు, పాఠశాలల్లో ఘనంగా సైన్స్ దినోత్సవం
- నూతన ఆవిష్కరణలతో ఆకట్టుకున్న విద్యార్థులు



ఏయూలో సర్ సీవీ రామన్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఆచార్య షారోన్‌రాజు



నమూనాలు ప్రదర్శిస్తున్న చైతన్య విద్యార్థినులు



చిన్నారులు రూపొందించిన ప్రాజెక్టులతో వీసీ ప్రసాదరెడ్డి తదితరులు



సెక్టార్-7లోని జేక్ స్కూల్లో విద్యార్థుల ప్రదర్శన తిలకిస్తున్న ఉపాధ్యాయులు



కృష్ణా కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయబాబు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని పలు విభాగాల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా నోబెల్ గ్రహీత సర్ సీవీ రామన్ చిత్రపటానికి విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత్ గర్వించే శాస్త్రవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత సర్ సీవీ రామన్ ఆంధ్ర విశ్వవిద్యాలయం భౌతిక శాస్త్ర విభాగంలో పరిశోధనలు జరపారని, ఏయూతో ఆయనకు సుదీర్ఘ అనుబంధం ఉందన్నారు. విద్యార్థులు అటువంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత లక్ష్యాల వైపు పయనించాలని సూచించారు. కార్యక్రమంలో విభాగ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గణితశాస్త్ర విభాగంలో..

గణిత శాస్త్ర విభాగంలో నిర్వహించిన కార్యక్రమంలో విభాగ పూర్వ ఆచార్యులు కె.చక్రధరరావుని సత్కరించారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఆచార్య పి.డి.ఎస్. శ్రీనివాస్, ఆచార్య జి.నానాజీరావు, ఆచార్య ఎస్.రవికుమార్, ఆచార్య ఎస్.రామకృష్ణ, ఆచార్య కె.కె.ఎం. శర్మ తదితరులు పాల్గొన్నారు.

వృక్షశాస్త్ర విభాగంలో..

ఏయూ వృక్షశాస్త్ర విభాగంలో నేషనల్ సైన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు సైన్స్ సంబంధిత పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య పి.కె. రత్నకుమార్, డాక్టర్ బి.సంధ్యశ్రీ, డాక్టర్ పి.బలరామస్వామి యాదవ్, ఆచార్య బి.సుజాత, ఆచార్య డి.సంధ్యా దీపిక, ఆచార్య ఎం. వెంకయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ రకాల మొక్కల గురించి విద్యార్థులకు వివరించారు.

చిన్నారుల్లో శాస్త్రీయ దృక్పథం పెరగాలి..

శాస్త్ర విజ్ఞానం, ఆవిష్కరణలపై పాఠశాల స్థాయి నుంచి చిన్నారుల్లో ఆసక్తి కలిగించాల్సిన అవసరం ఉందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి అన్నారు. నేషనల్ సైన్స్ డేని పురస్కరించుకుని తన కార్యాలయానికి విచ్చేసిన కిడ్స్ క్రియేట్ పాఠశాల చిన్నారులతో ఆయన కాసేపు గడిపారు. చిన్నారులు తీసుకువచ్చిన వివిధ ప్రాజెక్టు నమూనాలను ఆయన ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలువురు చిన్నారులు శాస్త్రవేత్తల వేషధారణలో రావడం వీసీ గమనించి వారిని అభినందించారు. భవిష్యత్తులో మీరంతా దేశం గర్వించే శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, పాఠశాల అధ్యాపకులు టి.సుకన్య, నిర్మల, డి.మీన తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా కళాశాలలో..

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్. కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలానికి అనుగుణంగా శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. ఐఐపీఈ డైరెక్టర్ శాలివాహన, కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుంది..

బీచ్‌రోడ్డు: మద్దిలపాలెంలోని శ్రీగాయత్రి విద్యా నిలయంలో సైన్స్‌డే ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను ప్రిన్సిపాల్ డి.పద్మావతి పరిశీలించి అభినందించారు. ఇలాంటి ప్రదర్శనల వల్ల విద్యార్థుల్లోని సృజనాత్మకత మరింత పెరుగుందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధికి దోహదం.. శాస్త్ర ప్రయోగాలు..

ఆశీల్ మెట్ట-3 శ్రీ చైతన్య పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను అపోలో ఆస్పత్రి చీఫ్ కన్సల్టెంట్, ప్రముఖ అంకాలజిస్ట్ డాక్టర్ రాకేష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పరిశీలించారు. మానవ జీవనాభివృద్ధికి శాస్త్ర ప్రయోగాలు ఉపయోగపడతాయన్నారు. ప్రిన్సిపాల్ కె.నాగేశ్వరరావు, డీన్ పి.రవికుమార్, అసిస్టెంట్ డీన్ మాధవనాయుడు, సి-ఇన్చార్జి శ్రీను తదితరులు విద్యార్థులను అభినందించారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన..

ఎంవీపీకాలనీ: సెక్టార్-7లోని జేక్ స్కూల్లో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. 40 స్టాల్స్ ద్వారా విద్యార్థులు వారి ప్రాజెక్టులను ప్రదర్శించారు. కాలుష్య నివారణ, నీటి వనరులు, అణుపరిమాణం, సౌరకుటుంబం వంటి విద్యార్థుల ఆవిష్కరణలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ ఆర్.వి.విజయకుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు తిలకించారు.

ఘనంగా టైలర్ల దినోత్సవం

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ టైలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు టైలర్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కాలనీలోని సెక్టార్-7 కూడలిలో బుధవారం ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక, సహపంక్తి భోజన కార్యక్రమంలో పలు ప్రాంతాల టైలర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పలువురు టైలర్లు మాట్లాడుతూ ప్రభుత్వం టైలర్ల కుటుంబాలను ఆదుకోవాలన్నారు. ఆర్థికాభివృద్ధితో పాటు వృత్తి నైపుణ్యం సాధించే విధంగా ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు శ్రీనివాసరావు, నరసింహం, బుజ్జి, జోగారావు, సోమరాజు, శ్రీను, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న ఎంవీపీ టైలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

శిథిల డస్ట్‌బిన్‌తో ఇక్కట్లు

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ 19వ వార్డు జాలరిపేట ఫిష్ మార్కెట్ సమీపంలో ఉన్న ఓ డస్ట్‌బిన్ శిథిలావస్థకు చేరడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు స్థానికులు చెబుతున్నారు. చాలా సంవత్సరాలుగా వినియోగంలో ఉన్న ఈ డస్ట్‌బిన్‌కు పెద్దపెద్ద రంధ్రాలు పడడంతో స్థానికులు వేసే చెత్త రోడ్డుపై పడి దుర్వాసన వెదజల్లుతోందని వెల్లడిస్తున్నారు. ఇది ప్రధాన కూడలి కావడం, ఫిష్‌మార్కెట్, దేవాలయాలు ఉండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నట్లు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది స్పందించి సమస్యను పరిష్కరించాలని, ఆ ప్రాంతంలో కొత్త డస్ట్‌బిన్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



డస్ట్‌బిన్ శిథిలం కావడంతో రోడ్డుపై పడిన వ్యర్థాలు

ఏయూలో ఇద్దరికి డాక్టరేట్

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వ విద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం పరిశోధకురాలు జె.మనోజ్ఞకు డాక్టరేట్ లభించింది. ఆచార్య ఎస్.కిషోర్‌బాబు పర్యవేక్షణలో ఉద్యోగుల వైవిధ్యత, ఉద్యోగుల పనితీరుపై దాని ప్రభావం (ఏ స్టడీ ఆన్ భెల్, విశాఖపట్నం) అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను మనోజ్ఞ స్వీకరించారు.

ఎకనమిక్స్‌లో పాదాలుకి..

ఆంధ్ర విశ్వ విద్యాలయం ఎకనామిక్స్ విభాగం పరిశోధక విద్యార్థి చీపురుపల్లి పాదాలుకి ఏయూ డాక్టరేట్ లభించింది. విభాగ ఆచార్యులు జి.నాగరాజ పర్యవేక్షణలో ఇంపాక్ట్ ఆఫ్ నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ మిషన్ (ఎన్ఎఫ్ఎస్ఎం) ఇన్ ఇంప్రూవింగ్ అగ్రికల్చరల్ ప్రొడక్టివిటీ ఆఫ్ సెలక్టెడ్ క్రాప్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి నుంచి పాదాలు ఉత్తర్వులను స్వీకరించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఆరిలోవ: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తూర్పు నియోజకవర్గంలో అర్హులైన ప్రజలందరికీ అందుతున్నాయని నియోజకవర్గ సమన్వయకర్త, విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. జీవీఎంసీ 12వ వార్డులో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఆయన పాదయాత్ర నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులతో కలిసి ఆయన పెదగదిలి కొండవాలు ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధి గురించి ఆరా తీశారు. ఎవరికి ఏయే పథకాలు అందాయో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించారన్నారు. దీంతో వైఎస్సార్‌సీపీ పాలనపై అందరూ సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైల్డ్‌లైఫ్ వార్డెన్ సత్తి మందారెడ్డి, స్థానిక నాయకులు కన్నేటి సుబ్బారెడ్డి, అర్జున్, కొండమ్మ, కనకరాజు, రమణ, హుస్సేన్, సుజాత తదితరులు పాల్గొన్నారు.



పెదగదిలిలో వృద్ధులతో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

యువతిని బెదిరించిన యువకుడు

బీచ్‌రోడ్డు: తనతో రాకపోతే కత్తితో గొంతు కోసి చంపేస్తా.. లేదా కోసుకుని చచ్చిపోతా అని యువతిని బెదిరించిన యువకుడిపై యువతి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రేసవానిపాలెంలో నివాసం ఉంటున్న సంధ్య, దుర్గాప్రసాదరావు దంపతులకు ఇద్దరు పిల్లలు. కుమార్తె ప్రసన్న నగరంలోని ఒక ప్రైవేటు కాలేజీలో ఇంటర్ చదువుతోంది. గతంలో తనతో పాటు స్కూల్లో చదువుకున్న జి. కుమార్‌శంకర్, ప్రసన్న 2022లో ఇన్‌స్టాగామ్ ద్వారా కలుసుకున్నారు. గత నెల 22వ తేదీన ప్రసన్న, కుమార్‌శంకర్ కనిపించకుండా పోయారు. వారిని అతి కష్టం మీద కనిపెట్టి మూడో పట్టణ పోలీసులకు అప్పజెప్పారు. ఇద్దరికీ కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు. అయితే మంగళవారం కుమార్ శంకర్ యువతి ఇంటికి వెళ్లి మెడపై కత్తి పెట్టి తనతో రావాలని లేకపోతే చచ్చిపోతా అని.. లేదా నిన్ను చంపేస్తా అని బెదిరించాడు. దీంతో పెద్దగా కేకలు వేయటంతో చుట్టుపక్కల వారు రావటంతో యువకుడు పరారయ్యాడు. ఆ యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మానవహక్కులపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న సత్యనారాయణ

బీచ్‌రోడ్డు: మానవ హక్కులపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు బుధవారం నగరంలోని ఒక హోటల్లో సదస్సు నిర్వహించారు. మహిళల హక్కులు, విద్యార్థుల హక్కులపై జరిగిన ఈ సదస్సులో దామోదర్ సంజీవయ్య యూనివర్సిటీ మాజీ వీసీ వై.సత్యనారాయణ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా మానవ హక్కులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంత్రి శ్యాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విమ్స్‌లో అందుబాటులో అంకాలజీ వైద్య నిపుణులు


ఆరిలోవ: విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో అనుభవజ్ఞులైన అంకాలజీ వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నారని డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. బుధవారం క్యాన్సర్ ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇక్కడ ఓపీ విభాగంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ శిబిరం కొనసాగింది. శిబిరానికి వచ్చిన రోగులకు అంకాలజీ వైద్య నిపుణులు క్యాన్సర్ పరీక్షలు చేసి వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ శిబిరంలో 75 మంది వైద్య సేవలు వినియోగించుకున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. నోటి క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, ఎముకలకు సంబంధించిన క్యాన్సర్, చర్మ క్యాన్సర్ పరీక్షలు చేసినట్లు తెలిపారు. వారిలో 8 మందికి ఎఫ్ఎన్ఏసీ పరీక్షలు, 12 మందికి మెమోగ్రాం పరీక్షలు కూడా చేసినట్లు తెలిపారు. ఇవి ఖరీదైన పరీక్షలన్నారు. విమ్స్‌లో ఇటీవల కొత్తగా క్యాన్సర్ విభాగం ప్రారంభించినట్లు తెలిపారు. మందుల ద్వారా క్యాన్సర్ నయం చేసే ఇద్దరు వైద్య నిపుణులు, కణితులకు సర్జరీ చేసే మరో ఇద్దరు వైద్యులు, సహాయక సిబ్బంది అందుబాటులో ఉన్నారన్నారు.



మహిళకు క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, విమ్స్ డైరెక్టర్ రాంబాబు

అవగాహనతోనే క్యాన్సర్‌కు చెక్

మద్రిపాలెం: అవగాహనతోనే క్యాన్సర్‌కు చెక్ పెట్టవచ్చని డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. జూనియర్ చాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ విశాఖ వ్యాలీ ఆధ్వర్యంలో మద్రిపాలెం ఎఫ్‌సీఐ పార్కులో బుధవారం క్యాన్సర్‌పై నారీ ఇన్ పింక్ సారీ పేరుతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయలక్ష్మి, జేసీఐ విశాఖ వ్యాలీ అధ్యక్షురాలు ఇంద్రజ శంకు మాట్లాడుతూ ఆహారపు అలవాట్లు, జీవన శైలి కారణంగా ప్రతి 50 మందికి ఒకరిలో క్యాన్సర్ లక్షణాలు కనిపిస్తున్నాయన్నారు. మహిళల్లో స్వీయ పరీక్ష ద్వారా క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించి తగిన చికిత్స ద్వారా నివారించవచ్చని తెలిపారు. సుమారు 80 మందికి పైగా మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జేసీఐ లేడీ జోన్ ఆఫీసర్ జ్యోతిరాణి, భవ్య, స్వర్ణ, లత తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ విజయకుమారి

విద్యపై అవగాహన



పిల్లలకు పలకలు అందిస్తున్న బుల్లయ్య కాలేజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

సీతంపేట: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి స్పెషల్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం కళాశాల సమీపంలోని రేసపువానిపాలెంలో పిల్లలకు పలకలు, నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. విద్య ఆవశ్యకత, విద్యతో కలిగే ఉన్నతిపై పిల్లలకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం ఆఫీసర్ ఎస్.శివజ్యోతి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డి.దీపక్ చౌదరి పాల్గొన్నారు.

రైతుబజార్ వ్యాపారులు వివాదాల జోలికి పోరాదు

ఏయూక్యాంపస్: స్థానిక పెదవాల్తేరు రైతుబజార్ తరచూ వివాదాల్లో నిలుస్తోంది. తాజాగా ఇద్దరు పండ్ల వ్యాపారుల మధ్య వివాదం అధికారుల దృష్టికి వెళ్లింది. దీంతో మార్కెటింగ్ విభాగం ఏడీ యాసీన్ దీనిపై విచారణ చేయడానికి బుధవారం రైతుబజార్‌కు వచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. పెదవాల్తేరు రైతు బజార్‌లో రెండు పండ్ల విక్రయ దుకాణాలు ఉన్నా యి. వీరిద్దరి మధ్య పోటీ వాతావరణం వల్ల వివాదాలు జరుగుతున్నాయి. ఇటీవల వీరి మధ్య వివాదం పెద్దదవడంతో స్పందనలో ఫిర్యాదులు చేసుకునే వరకు వెళ్లింది. విషయం అధికారుల దృష్టికి వెళ్లడంతో మార్కెటిండ్ శాఖ ఏడీ విచారణ జరిపారు. ఇద్దరు రైతులను పిలిచి వివాదాలు వద్దని, ఎవరి వ్యాపారం వారు చేసుకోవాలని సూచించారు. ఇటు వంటి సంఘటనలు పునరావృతం అయితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా రైతుల కార్డులు తనిఖీ చేసి రైతుబజారు నిర్వహణకు సంబంధించి అధికారులతో మాట్లాడారు.



రైతుల కార్డులు తనిఖీ చేస్తున్న ఏడీ యాసీన్

డిజిటల్ విద్యకు ప్రాధాన్యం

విశాఖ విద్య: జిల్లాలోని భవిత కేంద్రాల్లో ప్రత్యేక అవసరాల పిల్లలకు డిజిటల్ విద్య బోధనకు ప్రాధాన్యత ఇవ్వాలని డీఈవో ఎల్.చంద్రకళ సూచించారు. నగరంలోని సమగ్ర శిక్ష కార్యాలయంలో బుధవారం జిల్లాలోని భవిత కేంద్రాల నిర్వాహకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకొనేలా బోధన సాగించాలన్నారు. భవిత కేంద్రాలకు ట్యాబ్‌లను పంపిణీ చేసినందున వీటిపై అవగాహన పెంచుకొని, విద్యార్థులకు తోడ్పాటుగా నిలవాలన్నారు. సమావేశంలో సమగ్ర శిక్ష ఏపీసీ బి.శ్రీనివాసరావు, ఏపీవో అప్పలనాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

నేడు సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

ఆటో చోరీ

బీచ్‌రోడ్డు : రాత్రి సమయంలో ఇంటి వద్ద పార్కింగ్ చేసిన ఆటో చోరీకి గురైంది. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామ్‌నగర్‌లో నివాసం ఉంటున్న కె. రాము ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం (ఏపీ 31 టీయూ9485) సర్వీసు ముగించుకుని ఇంటి వద్ద పార్కింగ్ చేశాడు. బుధవారం ఉదయం చూసేసరికి ఆటో కనిపించకపోవటంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో వెదికాడు. సాయంత్రం వరకు అనేక ప్రాంతాల్లో గాలించినా ఆటో లభ్యం కాకపోవటంతో మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కథలు మానవతా విలువలు పెంచాలి

సీతంపేట: సహృదయ సాహితీ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో బుధవారం జరిగిన కథా కచేరీలో ప్రముఖ రచయితలు చదివిన కథలు అందరినీ అలరించాయి. ముఖ్య అతిథి, కథా రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు మాట్లాడుతూ కథానిక మానవతా విలువలను పెంచేదిగా ఉండాలన్నారు. వ్యక్తులకు సభ్యతా, సంస్కారం నేర్పేటట్టు ఉండాలని సూచించారు. సత్యాన్ని నిలబెట్టడం, ధర్మాన్ని ఆచరించమని కేవలం వాక్యంగా చెప్పడం కాకుండా కథలోని పాత్రలు, నడత ద్వారా ప్రతిబింబింప చేయాలన్నారు. సభాధ్యక్షుడు శేఖర మంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ కథలు మానసిక ఉల్లాసంతో పాటు నైతికత పెంపొందించేలా ఉండాలన్నారు. కార్యక్రమంలో భాగవతుల సత్యనారాయణ, సిహెచ్.చినసూర్యనారాయణ, కొత్తూరు రమణ, కుప్పిలి భీమేశ్వరరావు, కె.జి.వేణు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ద్విభాష్యం రాజేశ్వరరావు

2న పుస్తకావిష్కరణ

సీతంపేట: ప్రొఫెసర్ కె.ఎస్.చలం రచించిన 'బౌద్ధ విజ్ఞానం, లౌకిక జీవనం' పుస్తకావిష్కరణ సభ మార్చి 2వ తేదీ శనివారం సాయంత్రం 5.30 గంటలకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరుగుతుందని అరసం ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. మయన్మార్ (బర్మా)కు చెందిన భిక్షు రాజధమ్మ ముఖ్య అతిథిగా పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. ఏయూ ఫిలాసఫీ విభాగాధిపతి వి.వెంకటరావు అధ్యక్షతన జరిగే సభలో కవులు, కళాకారులు, సాహిత్యాభిలాషులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.